క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ ఓబీసీ సంఘం ఆర్థిక సాయం



కన్నారావు కుటుంబానికి చెక్కు అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: ఇటీవల మృతి చెందిన విశాఖ స్టీల్‌ప్లాంట్ యూఈఆర్ఎస్ విభాగం ఉద్యోగి, సిటూ నాయకుడు ఉప్పల కన్నారావు కుటుంబానికి స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ 'ఆ నలుగురు' పథకంలో రూ.15వేల చెక్‌ను అందించింది. శనివారం దిబ్బపాలెంలో కన్నారావు కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, యు.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంచిలి అప్పారావు, యు.దిలీప్‌కుమార్, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

12న అప్రెంటిస్ మేళా

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎల్, విసూవియస్ ఇండియా లిమిటెడ్, మైలాన్ లాబొరేటరీస్, సినర్జీస్ అండ్ కాస్టింగ్, కనోరియా కెమికల్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, సృజన ఇంజినీరింగ్, జాన్‌టీర్, డొజికో, వీల్‌మార్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరు కానున్నారని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అప్రెంటిస్ రిజిస్టర్ నంబర్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 91773 38977, 83744 30616 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉక్కు నిర్వాసితుల మహా ధర్నా

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ ఈ నెల 11న ఉదయం మహా ధర్నా చేయనున్నామని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా అమిత్ షా ప్రకటన చేయాలని కోరారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి తోడపెద్దు సేవ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సెక్టార్-1 పినమడకలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తోడపెద్దు జాతరను నిర్వహించారు. పినమడక సేవ గరిడీ సంఘం, సూరిశెట్టి పెద అప్పారావు శిష్య బృందం ఆధ్వర్యంలో రాట ఉడుపు, తొలి పాలగొలుపు, రెండో పాలగొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ఏదూరి రాజేష్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

వాటర్ ప్లాంట్ సీజ్



వాటర్ ప్లాంట్‌కు తాళం వేస్తున్న అధికారులు

పెదగంట్యాడ: దుర్గవానిపాలెం ఎస్సీ కాంప్లెక్స్‌లో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను జీవీఎంసీ అధికారులు శనివారం సీజ్ చేశారు. గత కొన్నేళ్లుగా ఈ ప్లాంట్ నుంచి పెద్ద ఎత్తున నీటిని అక్రమంగా గంగవరం పోర్టుకు విక్రయిస్తున్నారని ములకపల్లి ప్రకాష్ అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు ప్లాంట్‌ను మూసివేశారు.

ఉష్ణ తాపం.. అల్లాడిన జనం



నిర్మానుష్యంగా వడ్లపూడి ప్రధాన రహదారి



పాతగాజువాక జంక్షన్‌లో పలుచగా జనం

- ఉదయం నుంచే ఎండ ప్రచండం
- 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

గాజువాక : ఈ ఏడాది వేసవి఼ తారెత్తిస్తోంది. వేడి, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. జూన్ రెండో వారం వచ్చినా వర్షం జాడ కనిపించకపోవడంతో ఆకాశం వైపు జాలిగా చూస్తున్నారు. రోజురోజుకు ఎండలు ఉధృతమవుతుండటంతో విలవిల్లాడుతున్నారు. ఉదయం ఏడు గంటలకే ఎండ ప్రభావం చూపుతోంది. పొద్దెక్కేకొద్దీ ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతోంది. సమయం పది గంటలయ్యేసరికి ఎండ భీకరంగా మారుతోంది. గాజువాక ప్రాంతంలో శనివారం ఎండ 44.6 డిగ్రీలుగా నమోదైంది. ఉధృతంగా ఎండ కాయడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు వెనుకడుగు వేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు మంటల మధ్య వెళ్తున్నట్టుగా ఆందోళన చెందుతున్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ఇతర అవసరాల కోసం బయటకు వచ్చేవారు ఎండదెబ్బకు ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం 11 గంటలకు రోడ్లపై జన సంచారం లేకపోవడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

ఆ ఐదు గంటలూ అత్యంత ప్రమాదకరం

ప్రస్తుత ఎండలు అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి.రోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండలో తిరగకపోవడం మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బకు గురై ప్రాణాలమీదకి తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బను గుర్తించడం ఇలా..

వడదెబ్బ తగిలిన వారికి అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. చెమటలు బాగా పట్టేస్తాయి. ఆందోళన పెరుగుతుంది. బాగా నీరసంగా అనిపిస్తుంది. ఎండలోకి వెళ్లి వచ్చిన వారిలో ఈ లక్షణాలుంటే వారిని వెంటనే నీడలోకి తరలించాలి. వారి దుస్తులను వదులుగా చేయాలి. తడిగుడ్డతో ఒళ్లంతా తుడవాలి. ఓఆర్ఎస్ ద్రావణం తాగించి, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ఎండలోకి వెళ్లాల్సి వస్తే..

- ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండలోకి వెళ్లకపోవడమే మంచిది. ఒకవేళ బయట ఏదైనా పని ఉంటే ఉదయం పదిలోపు ముగించుకోవడం, లేదంటే సాయంత్రం చూసుకోవడం ఉత్తమం. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ఎండ నేరుగా పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖానికి రుమాలు కట్టుకోవడం, స్కార్ఫ్‌లు ధరించడం, వీలైనన్ని ఎక్కువసార్లు మజ్జిగ తాగడం, బార్లీ తీసుకోవడం, ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వంటివి చేయాలి. లేని పక్షంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు చెబుతున్నారు.
- ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతల తీవ్రతకు మసాలాలను పూర్తిగా మానేయాలి. కూరల వేపుళ్లు తగ్గించాలి. కారం బాగా తగ్గించుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉండటం మంచిది. మాంసాహారం మానలేకపోతే బాగా తగ్గించుకోవాలి. ఉడికించిన కాయగూరలను తినడం మేలు. మంచినీళ్లు రోజుకు ఐదారు లీటర్ల వరకు తాగాలి.
- ఈ సీజన్‌లో పండ్లు బాగా మేలు చేస్తాయి. నీటి శాతం అధికంగా ఉన్న పళ్లను తీసుకోవడం ఉత్తమం. ద్రాక్షపళ్లు, పుచ్చకాయ, కర్బూజా, బత్తాయిలు, బొప్పాయి వంటి పళ్లలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఈ పళ్లను తీసుకోవడం ద్వారా ఎండల తీవ్రతనుంచి ఉపశమనం పొందడానికి అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

రూ.1.7 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో రూ.1.70 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. నాతయ్యపాలెం పాత పంచాయతీ ఆఫీసు వద్ద రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు, హరిజన జగ్గయ్యపాలెం శ్మశానవాటిక వద్ద రూ.50 లక్షలతో వెయిటింగ్ హాలు, షీలానగర్ గ్రంథాలయం వద్ద రూ.20 లక్షలతో మహిళలకు కమ్యూనిటీ హాలు, చుక్కవానిపాలెం వద్ద రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు, కాపుతుంగ్లాం వద్ద రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు, తుంగ్లాం ధోబీఖానా వద్ద రూ.20 లక్షలు రజకుల కమ్యూనిటీ హాలు, తుంగ్లాంలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నాతయ్యపాలెంలోని శాఖాగ్రంథాలయ భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో రాజీ లేకుండా సత్వరం నిధులు మంజూరు కావడంతో వెనువెంటనే పనులు ప్రారంభం అవుతున్నాయన్నారు. గాజువాకలో ఎక్కడ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు గంధ్రెడ్డి రామునాయుడు, బంగారయ్య శ్రీను, గోపిశెట్టి గోపి, బోగాది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

66వ వార్డులో రూ.80 లక్షలతో..



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా, రాజకీయాలకతీతంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. 66వ వార్డులోని బీసీ రోడ్‌లో రోడ్డు, కాలువల పునర్నిర్మాణం, ఇందిరా కాలనీలో నూతన కల్వర్టు, కైలాసనగర్, వాసవీ మాత ఆలయ మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పనులను రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందిరా కాలనీ, కణితి రోడ్ ప్రధాన కాలువలు సరిగా లేకపోవడం వల్ల భారీ వర్షాల సమయంలో జనం అవస్థలు పడుతున్నారన్నారు. వాటి అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, స్థానిక నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, కేశారపు శ్రీను, సతీష్, జగన్నాథం, కర్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ప్యానెల్ విజయం

ప్రశాంతంగా భెల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎన్నికలు



విక్టరీ సింబల్ చూపుతున్న ఐక్యత ప్యానెల్


అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఐక్యత ప్యానల్ విజయం సాధించింది. ఎన్నికల్లో జై భీమ్ ప్యానల్ గట్టి పోటీ ఇచ్చింది. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంస్థ ట్రైనింగ్ సెంటర్, హెచ్ఆర్‌డీసీలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 162 ఓట్లు ఉండగా 129 ఓట్లు పోలయ్యాయని, ఇందులో చెల్లని ఓట్లు 20గా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు కె.పి.మిశ్రా, రాజేంద్రబాబు తెలిపారు. ఎన్నికల ఫలితాలను రాత్రి 7.30 గంటల తర్వాత ప్రకటించారు. విజయం సాధించిన ఐక్యతా ప్యానల్ అంబేడ్కర్ పార్క్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాలలు వేశారు.

విజేతలు వీరే..

ఐక్యత ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేసిన జి.కిరణ్‌కు 70 ఓట్లు రాగా జై భీమ్ ప్యానల్ అభ్యర్థి టి.రవికుమార్‌కు 56 ఓట్లు వచ్చాయి ఇందులో చెల్లని ఓట్లు 3 ఉన్నాయి. ప్రధాన కార్యదర్శిగా ఐక్యతా ప్యానల్ అభ్యర్థి కొల్లి దేముడుకు 73 ఓట్లు రాగా, జై భీమ్ అభ్యర్థి జె.రామ చంద్రరావుకు 55 ఓట్లు వచ్చాయి. ఇందులో చెల్లని ఓటు 1 ఉందన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.ఆర్.కె.దాస్, ఉపాధ్యక్షులుగా టి.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా డి.సాయిబాబు, పి.సురేష్, కోశాధికారిగా జి.సంజీవరావు విజయం సాధించారు. ఐక్యతా ప్యానల్‌లో సంయుక్త కార్యదర్శిగా బి.రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కుట్రతో ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందన్నారు. 2021 జనవరిలో కేంద్రం నిర్ణయం తీసుకున్న నాటి నుంచి ఉద్యమం చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనలో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. విశాఖ పర్యటనలో అమిత్ షాను కలిసేందుకు అవకాశం ఇవ్వాలని కలెక్టర్, పోలీసు కమిషనర్, బీజేపీ ఎంపీ, నాయకులను కలిసి అభ్యర్థించామన్నారు. ఆదివారం ఉదయం కూర్మన్నపాలెం దీక్షా శిబిరానికి ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, ప్రభాకరరెడ్డి, బీఎంకె నాయక్, కొమ్ము ప్రసాద్, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్‌పరం కాకుండా ప్రజలందరూ ఏకమై కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షల్లో 849వ రోజు శనివారం సంస్థకు చెందిన ట్రాఫిక్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దీక్షలు ప్రారంభించి 850 రోజులు పూర్తవుతున్న సందర్భంగా మరియు కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో ఆదివారం ఉదయం కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టనున్న భారీ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

ఐసీఐసీఐలో ఉద్యోగాల భర్తీకి 13న ఇంటర్వ్యూలు

గాజువాక : ఐసీఐసీఐలో సీనియర్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఐఎఫ్‌బీఐ, ఎన్ఐఐటీ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న ఈ ఇంటర్వ్యూలకు 2022లో డిగ్రీ పాసైన అభ్యర్థులు, పీజీ ఫైనలియర్ చదువుతున్నవారు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అన్ని తరగతుల్లోను 50 శాతం కనీస మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆన్‌లైన్ టెస్ట్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

కృష్ణానగర్‌లో మంచినీటి బోరు ప్రారంభం

గాజువాక : జీవీఎంసీ 67వ వార్డులోని కొండవాలు ప్రాంతమైన కృష్ణానగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్నిచోట్లా జీవీఎంసీ నీటి సరఫరా ఉందని, అయితే, వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి రాకూడదనే ఉద్దేశంతో మంచినీటి బోరును ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు పల్లా పెంటారావు, కె.భీమరాజు, వెంకటేష్, వై.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గట్టుపైకి దూసుకుపోయిన కారు



గట్టుపైకి ఎక్కిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ ట్రై వీక్లీ మార్కెట్‌లో శనివారం కారు అదుపు తప్పి గట్టుపైకి దూసుకుపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. వివరాలివి.. శనివారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కారులో మార్కెట్‌కు వెళ్లి, తిరిగి వస్తుండగా మలుపు తిప్పే సమయంలో కారు అదుపు తప్పి గట్టుపైకి దూసుకుపోయింది. కారు స్వల్పంగా దెబ్బ తిన్నప్పటికీ అందులో ఉన్న వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. సకాలంలో కారు ఆగకపోయి ఉంటే గట్టు పక్కన ఉన్న కల్వర్టులోకి కారు పడిపోయేది. స్థానికుల సహకారంతో కారును బయటకు తీశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



మృతురాలు లంకి సోములమ్మ

కూర్మన్నపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెంకన్నమత్రిపాలెం ప్రాంతానికి చెందిన లంకి సోములమ్మ(65) కూరగాయల వ్యాపారం చేస్తుంటుంది. ఈ క్రమంలో నగరంలో కూరగాయలు కొనేందుకు వెళ్తుండగా అగనంపూడి దరి ఏడుమెట్ల మత్రిపాలెం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఆమె మేనల్లుడు బలిరెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి శిబిరంలో శిక్షణపై విద్యార్థులతో సమీక్ష

గాజువాక : గాజువాక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో నేర్పిన అంశాలపై గ్రంథాలయాధికారి బి.చంద్రకళ విద్యార్థులతో సమీక్ష నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులు ఏం నేర్చుకున్నారన్న విషయంపై ప్రతి ఒక్కరితో మాట్లాడి తెలుసుకున్నారు. శిబిరంలో పాల్గొన్న రిసోర్సు పర్సన్లు నేర్పిన అంశాలపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ నెల 11న నిర్వహించనున్న విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు.

కోదండ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని కోదండ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి చేతులమీదుగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టింపజేశారు. మూడు రోజులుగా 21 మంది దంపతులు మాలధారణ చేసి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం 15 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డి, దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, అప్పలరెడ్డి, కేఎన్ రెడ్డి, దూడ సింహాచలం, దల్లి పైడిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న స్మృతి దివస్

'సీ' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సామాజిక కార్యక్రమాల నిర్వహణ



ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ప్రచారం చేస్తున్న సీ, లయన్స్, జేసిస్ ప్రతినిధులు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న స్మృతి దివస్ విజయవంతం చేయాలని సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు కోరారు. ఉక్కు పాట్టి శ్రీరాములు కూడలి వద్ద శనివారం సీ ఆధ్వర్యంలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2లో ఉత్పత్తి ప్రారంభించే ప్రక్రియలో జరిగిన ఆక్సిజన్ ప్లాంట్ ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి సంస్మరణార్థం ఏటా స్మృతి దివస్ పేరిట రక్తదాన శిబిరం, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. లయన్స్ క్లబ్, జేసీఐల సహకారంతో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీ భవన్‌లో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆ రోజు నాలుగు దివ్యాంగ, అనాథాశ్రమాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీ, లయన్స్ క్లబ్, జేసిస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దగ్ధమైన పూరిల్లు

- పేలిన గ్యాస్ సిలిండర్
- మహిళకు గాయాలు



గాయపడిన మహిళ



పేలిన సిలిండర్



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

గాజువాక : పాతగాజువాక దరి దశమికొండలో రెండు పోర్షన్ల గల ఒక పూరిల్లు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని గాజువాక మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దశమికొండ కాలనీలోని ఒక పూరింట్లో అన్నదమ్ములైన సీహెచ్.నాగరాజు, సీహెచ్.గోపీ కుటుంబాలు నివాసముంటున్నాయి. శనివారం మధ్యాహ్నం బాగా ఎండగా ఉండటంతో ఆ ఇళ్లలో వారు తమ పక్కింటి డాబాలోని బంధువుల ఇంట్లోకి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి పూరింట్లో నుంచి పెద్దగా మంటలు వచ్చి ఇల్లు మొత్తం దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంలో సిలిండర్‌కు మంటలు అంటుకొని పేలిపోయింది. సిలిండర్‌కు సంబంధించిన ఒక రేకు ఎగిరి వెళ్లి కొద్ది దూరంలో ఉన్న ఒక ఇంటి మేడపై గల మహిళ చేతికి తగలడంతో ఆమె గాయపడింది.

స్థానికులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ సిబ్బంది తెలియజేయడంతో అధికారులు వచ్చి ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. బాధితులకు అండగా ఉంటామని చందు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఉక్కు కార్మికుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉక్కు కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన పాటించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 849 రోజులుగా నిరాహార దీక్షలు సాగుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశాఖ పర్యటన సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిరసన కార్యక్రమాలను ప్రకటించింది. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని అన్ని విభాగాలకు చెందిన కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఆయా విభాగాల్లో జరిగిన సమావేశాల్లో పోరాట కమిటీ నాయకులు పాల్గొని ప్రభుత్వ విధానాలను నిరసించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతినిధిగా హోంమంత్రి విశాఖ పర్యటనలో ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, వై. మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మ్యూజికల్ నైట్



మ్యూజికల్ నైట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ తమిళ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మ్యూజికల్ నైట్ ఉత్సాహంగా జరిగింది. ఉక్కునగరం క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ టీపీపీ విభాగం సీనియర్ మేనేజర్ నరేంద్ర ప్రశాంత్, ఎస్‌బీఎం విభాగం మేనేజర్ బాలాజీ, ఎల్ఎంఎం విభాగం డీజీఎం పార్తీబన్, సింటర్‌ప్లాంట్ డీజీఎం అశోకన్, ఎస్ఎంఎస్-1 ఏజీఎం చంద్రశేఖర్ తమ గాత్ర మాధుర్యంతో ఆహూతులను అలరించారు. చెన్నై కళాక్షేత్ర మ్యూజికల్ కళాశాలకు చెందిన గాయకులు సెల్వీ, సంజన శ్రీనివాసన్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమిళ ఉద్యోగుల కుటుంబీకులు కీర్తిగా నాగలింగం, మంజు ముత్తరామన్, కె. గణేషన్, వివేక గణేశన్ తమ నాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యన్, ఉపాధ్యక్షులు కె.పి.సుబ్రమణ్యన్, చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, కార్యదర్శి నరేంద్రనాథ్ ప్రశాంత్, కోశాధికారి బాలాజీ, సంయుక్త కార్యదర్శి సంతోష్, భైరవి, కవిత తదితరులు పాల్గొన్నారు.